సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 25 । ఆగస్టు । 2025



ఖర్చును కంట్రోల్ చేద్దాం
జాతీయ రహదారులపై ప్రయాణం చేసేట ప్పుడు మనకు పలు ప్రాంతాల్లో టోల్ గేట్లు కనిపిస్తాయి. నాలుగు చక్రాలు ఆపైన పెద్ద వాహనాలన్నీ టోలు కట్టాల్సిందే. -8లో



ఫిట్‌పర్సన్ బదిలీ
ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేం ద్ర స్వామి మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బా లాజీని హైకోర్టు ఆదేశాలతో దేవదాయ శాఖ కమిషనర్ బదిలీ చేశారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.2/24.8

వాతావరణం
జిల్లాలో ఆదివారం 24.8 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప కార్పొరేషన్: దివ్యాంగుల పింఛన్లను రద్దు చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. కడపలో దివ్యాంగ పింఛన్లు కోల్పోయిన వారు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ద్వారా నోటీసులు అందుకున్న వారితో ఉదయం 9.30 నుంచి 12.00 గంటల వరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలోపార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా, మేయర్ కే.సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డితో పాటు రాష్ట్ర స్థాయి నాయకులు, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, జిల్లా, నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, నగర కమిటీ, మండల జోన్ కమిటీల ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు.

సికింద్రాబాద్-తిరుపతి రైలుకు రాజంపేటలో హాల్టింగ్

రాజంపేట:సికింద్రాబాద్-తిరుపతి (07009/10) మధ్య నడుస్తున్న ప్రత్యేకరైలుకు రాజంపేటలో హాల్టింగ్ ఇస్తూ ఆదివారం దక్షిణమధ్య రైల్వే ఉత్తర్వులు విడుదల చేసింది. దీపావళి, దసరా పండుగలను పురస్కరించుకొని రద్దీని తగ్గించేందుకు ప్రత్యేకరైలును తీసుకొస్తున్నారు. వచ్చేనెల 4 నుంచి 25 వరకు ఈ రైలు నడుస్తుంది. నాలుగు సర్వీసులతో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ రైలు వయా కాచిగూడా, మహబూబ్‌నగర్, గద్వాల్, కర్నూల్, ద్రోణాచాలం, ఎర్రగుంట్ల, కడప మీదుగా తిరుపతికి నడపనున్నారు.

ఆహార భద్రతా అధికారుల తనిఖీ



సామగ్రి పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత

కడప సెవెన్‌రోడ్స్: నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్ నిర్వాహకులు ఖచ్చితంగా ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత ఆదేశించారు. నగరంలోని ద్వారక ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఆదివారం ఆమె తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. వంటగదిని పరిశీలించారు. రెస్టారెంట్‌లో వండిన చికెన్ బిర్యానీ తదితర వంటకాల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. రెస్టారెంట్‌లో పరిశుభ్రత లోపించడంతో ఆమె యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. నిర్వాహకులు ఖచ్చితంగా ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని ఆదేశించారు.

నేడు సభాభవన్‌లో అర్జీల స్వీకరణ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నెంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం


డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమ వారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562- 244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చని వివరించారు.

పిల్లల్లో తగ్గుతున్న పెరుగుదల

పిల్లల్లో పౌష్టికాహార లోపం కలవరపరుస్తోంది. వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేకపోవడం.. తరచూ జ్వరాల బారిన పడడం ఆందోళన కలిగిస్తోంది. మంచి పోషకాహారం అందజేస్తూ చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాల్సిన పాలకులే నాణ్యత లేని ఆహార సరఫరాలు పంపిణీ చేయడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.



చిన్నారి ఎత్తును పరిశీలిస్తున్న అంగన్వాడీ కార్యకర్త





చిన్నారి బరువును చూస్తున్న అంగన్వాడీ కార్యకర్త

- పోషకాహార లోపంతో చిన్నారుల ఇబ్బందులు
- ప్రభుత్వ చర్యలు అంతంతమాత్రమే

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పరిధిలోగల పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. వందలాది మంది పిల్లలు పౌష్టికాహార లోపానికి గురవుతున్నారు. ఫలితంగా ఎత్తుకు తగ్గ బరువు, వయస్సుకు తగ్గ ఎత్తు ఉండడం లేదు. ఇలాంటి పిల్లల సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ఇక పౌష్టికాహార లోపం వల్ల పిల్లలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు.

కారణాలు అనేకం..

గర్భం దాల్చినప్పటి నుంచి మాతా శిశు ఆరోగ్యానికి చర్యలు తీసుకుంటున్నామని ఒకవైపు ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో సరైన ఫలితాలు రావడం లేదు. తక్కువ వయస్సులోనే వివాహాలు జరగడం, రక్తహీనత, గర్భస్థ సమయంలో అనారోగ్యానికి గురి కావడం, తదితర కారణాలవల్ల పుట్టే పిల్లల్లో పౌష్టికాహార లోపం, బరువు తక్కువగా ఉండడం జరుగుతోంది.

- జిల్లాలో 13 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 2389 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఇందులో 171 మినీ అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో 1,28,828 మంది చిన్నారులు ఉన్నారు. ఇందులో ఆరేళ్లలోపు చిన్నారులు 1331 మంది ఎత్తు తక్కువగా ఉన్నారు. అలాగే బరువు తక్కువగా ఉన్న వారు 1377 మంది, అలాగే పౌష్టికాహారలోపం ఉన్న పిల్లలు 4056 మంది ఉన్నారు.

ఎత్తు, బరువు, తూనిక

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న పిల్లల బరువు, ఎత్తు తెలుసుకునేందుకు వారి వద్ద ఉన్న పరికరాల ద్వారా తూకం వేస్తారు. బరువు, ఎత్తు తక్కువగల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఆరు నెలల్లోపు పిల్లల బరువు తక్కువగా ఉన్నా.. పౌష్టికాహార లోపం ఉన్నా తల్లి పాలు ఆరు నెలలపాటు తాపించాలని అంగన్వాడీ కార్యకర్తలు పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లికి అవగాహన కల్పిస్తున్నారు. ఆరు నెలలు దాటిన పిల్లలకు బాలామృతం, 100 ఎంఎల్ పాలు, గుడ్లు, ఇస్తారు. ఇటువంటి వారికి ఆహారాన్ని రోజుకు ఆరేడు సార్లు అందజేస్తారు.

పుట్టినప్పటి నుంచి రెండు సంవత్సరాల వరకు ఉండాల్సిన బరువు, ఎత్తు

వయస్సు	బరువు (కిలోలు)	ఎత్తు (సెం.మీ)
జన్మించినపుడు	3.3	49.9
మూడు నెలలు	6.4	61.4
ఆరునెలలు	7.9	67.6
తొమ్మిది నెలలు	8.9	72.0
12 నెలలు	9.6	75.7
15 నెలలు	10.3	79.1
18 నెలలు	10.9	82.3
21 నెలలు	11.5	85.1
24 నెలలు	12.2	87.8

- ప్రస్తుత కూటమి ప్రభుత్వం పిల్లల ఆరోగ్య సంరక్షణపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇటీవల జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పురుగులు పట్టిన కంది బేడలు అందించారు. అలాగే పలుచోట్ల మురిగిన గుడ్లు కూడా పంపిణీ చేయడం గమనార్హం. ఇప్పటికైనా పాలకులు దృష్టి సారించి నాణ్యత కలిగిన పౌష్టికాహారాన్ని అందజేయాలని బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల పరిధిలో పౌష్టికాహార లోపం, బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వయస్సుతగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలను పౌష్టికాహార లోపం ఉన్నట్లు గుర్తించి వారికి ప్రత్యేకంగా పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. అలాగే ప్రతి వ్యక్తి రోజుకు మూడుసార్లు ఆహారం తీసుకుంటారు. పౌష్టికాహారం లోపం ఉన్న పిల్లలకు రోజుకు ఆరేడు సార్లు ఆహారాన్ని అందించే విధంగా చర్యలు చేపడుతున్నాం. -పి.రమాదేవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్, కడప

ఒంటిమిట్టలో శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ



ఆలయం చుట్టూ కుంభారాధన చేస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం పవిత్ర ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అక్కడ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శాత్తుమొర, నివేదన, కుంభారాధన నిర్వహించారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు జరిపారు. ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. ధ్రువమూర్తులకు, కౌతుకమూర్తులకు, స్నపనమూర్తులకు, విశ్వక్సేనులవారికి, గరుడాళ్వార్‌కు, యాగశాలలోని హోమగుండాలకు, ధ్వజస్తంభానికి , ఆలయం ఎదురుగా ఉన్న భక్తసంజీవరాయస్వామికి పూజలు నిర్వహించారు.

ఘనంగా గంధోత్సవం



గంధం తీసుకువస్తున్న దృశ్యం, చిత్రంలో దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్

కడప సెవెన్‌రోడ్స్: కడప పెద్ద దర్గాలో ఆదివారం గంధోత్సవం ఘనంగా నిర్వహించారు. దర్గా 10వ పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా అమీనుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుస్సేనీ చిష్టి ఉల్ ఖాద్రి సాహెబ్ ఉరుసు ఉత్సవాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలి రోజున ఆదివారం గంధోత్సవంలో భాగంగా దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ మహమ్మదుల్ ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తన స్వగృహం నుంచి ఫకీర్ల మేళతాళాలతో గంధాన్ని తీసుకొచ్చారు. అనంతరం దర్గా గురువుల మజార్ వద్ద సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు, ఫాతెహా చేశారు. హాజరైన భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉరుసు, మంగళవారం తహలీల్ ఫాతెహా నిర్వహించనున్నారు. ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనేందుకు జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గురువుల ఆశీస్సులు పొందారు.

గిడుగు అడుగుజాడలు మార్గదర్శకాలు

డీఈఓ షేక్ షంషుద్దీన్



మాట్లాడుతున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్: గిడుగు రామమూర్తి పంతుల అడుగు జాడలు అందరికీ మార్గదర్శకాలని జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో ముందస్తు తెలుగుభాషా దినోత్సవాన్ని జిల్లా రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగు వెంకటరామమూర్తి పంతులు చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులు అర్పించారు. పండిత పరిషత్తు జిల్లా అధ్యక్షుడు ఎఫ్ఎంఎస్ ఖాదర్ అధ్యక్షత వహించిన సభకు విశిష్ట అతిథిగా డీఈఓ షేక్ షంషుద్దీన్ హాజరై మాట్లాడారు. మాతృభాష తెలుగుకు ఏ భాషా సాటి రాదన్నారు. గిడుగు రామమూర్తి పండితులు తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషి తరతరాలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పండిత పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌కృష్ణ , పండిత పరిషత్తు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్ర , రాష్ట్రబాధ్యులు రమేష్, రాష్ట్ర అదనపు నరసింహారెడ్డి, పద్మానాభయ్య మాట్లాడారు. అనంతరం వంద మంది తెలుగు ఉపాధ్యాయులను సత్కరించారు.

లోకేష్ పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

చింతకొమ్మదిన్నె: చింతకొమ్మదిన్నె మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో అధునాతన వసతులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ ను ఆదివారం కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. సెప్టెంబర్ 2న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో నూతన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్‌ను మంత్రిచే ప్రారంభించేందుకు సన్నాహక ఏర్పాట్ల కోసం ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాల ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపైనా ఎస్పీతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీఓ జాన్ ఇర్విన్, డీఈఓ షంషుద్దీన్, ఆగ్రోస్ డీఎం జోయల్ విజయ్ కుమార్, ఎస్ఎస్ఏ, సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల పరిశీలన

పెండ్లిమర్రి: మండల కేంద్రానికి సమీపంలో నూతనంగా రూ.12కోట్ల నిధులతో నిర్మించిన ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఆదివారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. సెప్టెంబర్ 2న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేస్తున్నారు. ముందస్తుగా వారు కళాశాల భవనాలను, కళాశాల పరిసరాలను పరిశీలించి కళాశాల ప్రిన్సిపల్‌తో, అధికారులతో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ అనురాధ పాల్గొన్నారు.



పెండ్లిమర్రిలో డిగ్రీ కళాశాల సిబ్బంది, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్

దారిమళ్లిన నాంధేడ్ వీక్లీ!

- ఉత్తరతెలంగాణాకు రైలు కనెక్టివిటీ
- మదనపల్లె, పీలేరులో హాల్టింగ్ సదుపాయం



నాంధేడ్-ధర్మవరం రైలు

రాజంపేట: ప్రస్తుతం నాంధేడ్ నుంచి ధర్మవరం మధ్య నడుస్తున్న (07189/17190) వీక్లీ ప్రత్యేక రైలు దారిమళ్లనుంది. ఈ రైలు ఇప్పుడు నిజామాబాద్, కామారెడ్డి, చర్లపల్లె, నల్గొండ, నడికుడి, పిడుగురాళ్ల, వినుకొండ, నంద్యాల, ఎర్రగుంట్ల , కడప , తిరుపతి, పాకాల మార్గాల్లో నడిచేది. వచ్చే నెల నుంచి ఈ రైలు నిజామాబాద్, పెద్దపల్లె, వరంగల్ , విజయవాడ, గుడూరు, తిరుపతి, పాకాల మీదుగా నడపనున్నారు.

- మొదటిసారిగా పీలేరు, మదనపల్లె, కదిరి నుంచి ఉత్తర తెలంగాణాలోని జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లె, వరంగల్‌తో పాటు ఖమ్మం జిల్లాకు కూడా అనుసంధానం ఏర్పడింది. ప్రస్తుతం ఈ ప్రాంతాల నుంచి పీలేరు, కలికిరి , మదనపల్లె, కదిరి వెళ్లడానికి నేరుగా సౌకర్యం లేదు. ఇప్పుడు ఈ ప్రత్యేకరైలుతో తెలంగాణా రాష్ట్రంలోని నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, వికారాబాదు, గద్వాల ప్రాంతాలలో ఇప్పటికే మదనపల్లె, పీలేరు, కలికిరి అనుసంధానమై ఉన్నాయి.
- నాంధేడ్ ప్రత్యేక రైలుతో ఉత్తర తెలంగాణాతో మదనపల్లె , పీలేరుకు రైలుసౌకర్యం లభించినట్లైంది. సెప్టెంబర్ 7, 14, 21, 28 తేదీల్లో ఎగువ మార్గంలో నాలుగుట్రిప్‌లు, 07190 నంబరుతో ధర్మవరం నుంచి నాంధేడ్ ప్రత్యేక వీక్లీ ఎక్స్‌ప్రెస్‌రైలు వయా మదనపల్లె, పీలేరు, పాకాల, తిరుపతి, గూడూరు, విజయవాడ,వరంగల్, పెద్దపల్లె, కరీంనగర్, నిజామాబాద్ మీదుగా నడవనుంది.

రైలునడిచేదిలా..

- నాంధేడ్ నుంచి ధర్మవరం వీక్లీ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌రైలు 07189 నంబరుతో 5, 12, 19, 26 తేదీల్లో నాంధేడ్‌లో సాయంత్రం 4.30గంటలకు బయలుదేరి, మరుసటిరోజు సాయంత్రం ధర్మవరం జంక్షన్‌కు 5గంటలకు చేరుకుంటుంది. అన్నమయ్య జిల్లాలో పీలేరు, మదనపల్లెరోడ్‌లో హాల్టింగ్ సదుపాయం కల్పించారు.
- 07190 నంబరు గలం నాంధేడ్ ప్రత్యేకరైలు(వయా తిరుపతి-విజయవాడ-పెద్దపల్లి)మీదుగా వెళ్లేటప్పుడు ఆదివారం ఉదయం మదనపల్లెరోడ్డు నుంచి 7.30గంటలకు, పీలేరు నుంచి 8.30 నిమిషాలకు బయలుదేరుతుంది.
- 07189 నాంధేడ్ నుంచి ధర్మవరం వీక్లీ ప్రత్యేక రైలు శనివారం మధ్యాహ్నం పీలేరులో 12.30 నిమిషాలకు, మదనపల్లె రోడ్ 1.15 నిమిషాలకు బయలుదేరేలా టైమింగ్స్‌ను ఏర్పాటుచేశారు. ఇప్పటికే ఈ రైలుకు సంబంధించి ఐఆర్‌టీఎస్ పోర్టల్‌లో బుకింగ్ సౌకర్యం ప్రారంభమైంది.

ఆధునాతన బోగీలతో...

నాంధేడ్ నుంచి ధర్మవరానికి నడిచే ప్రత్యేకరైలులో ఆధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీలు ఉన్నాయి. నాలుగు సాధారణ బోగీలు, 1 వికలాంగుల(పీహెచ్), 7 స్లీపర్‌బోగీలు, 6 థర్డ్ ఏసీ బోగీలు, 3 సెకండ్ ఏసీ బోగీల ఫార్మసిస్‌తో ఈ ఎక్స్‌ప్రెస్‌రైలు నడపనున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన ఎప్పుడు!



కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పోస్టులకు సంబంధించిన డీఎస్సీ -25 మెరిట్ జాబితాను ప్రభుత్వం విడుదల చేయడంతో అభ్యర్థుల్లో మరో టెన్షన్ మొదలైయింది. ఎన్ని మార్కులకు కటాఫ్ అవుతుందనే టెన్షన్ అభ్యర్థుల్లో ఆందోళన కలిగిస్తోంది. అభ్యర్థులు తమకు వచ్చిన మార్కులు, ర్యాంకులపై లెక్కలేసుకుంటున్నారు. రిజర్వేషన్లు, లోకల్, నాన్ లోకల్ అంచనాల్లో తలమునకలవుతున్నారు. ముఖ్యంగా రిజర్వేషన్ అభ్యర్థుల్లో ఏ కేటగిరిలో రోస్టర్ ఎక్కడ మొదలై ఎక్కడ ఆగిపోతుందనే దానిపై అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. కాగా.. మెరిట్ జాబితా విడుదలయినా.. సెలక్షన్ జాబితాపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నేరుగా మెసేజీలు వెళతాయని అధికారులు చెబుతున్నారు. మెరిట్ జాబితా తరహాలోనే సెలెక్షన్ జాబితాలు కూడా ప్రదర్శించాలని అభ్యర్థులు కోరుతున్నారు. మరోవైపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందనే విషయంలో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెల 25 నుంచి వెరిఫికేషన్ ప్రారంభమవుతుందనే చర్చ సాగుతున్న నేపథ్యంలో దూర ప్రాంతాల్లో ఉండే అభ్యర్థులు కొంత ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కులం, ఆదాయ, స్టడీ తదితర సర్టిఫికెట్లు తెచ్చుకావాలంటే ఇబ్బందులు ఎదురవుతాయని అభ్యర్థులు వాపోతున్నారు. దీనిపై డీఈఓతో మాట్లాడగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తేదీపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు సిద్ధం..

ఉమ్మడిజిల్లాలో 705 పోస్టులకు ఎంపికై న అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలనకు కడప బాలాజీ నగర్‌లోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా పోస్టులతోపాటు, జోనల్, రాష్ట్రస్థాయి పోస్టులకు ఎంపికైన జిల్లా అభ్యర్థులు కూడా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం 17 టీంలతోపాటు 30 మంది వలంటీర్లను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. ఈ మేరకు వారికి శిక్షణ కూడా ఇచ్చారు. వీరంతా అభ్యర్థులకు సంబంధించి విద్యార్హత, కులం, ఆదాయం, స్థానిక ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు.

డీఎస్సీ అభ్యర్థులు సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోవాలి: డీఈఓ

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ -2025కి ఎంపికైన అభ్యర్థులు తాజా సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. కడపలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు సన్నద్ధం కావాలని ఒక ప్రకటనలో సూచించారు. వివిధ కేటగిరి పోస్టులకుగాను జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు వారి వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్లు అందుతాయని తెలిపారు. కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకుని అందులో పేర్కొన్న సూచలనలను అనుసరించాలని తెలిపారు. అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌లో అవసరమైన సర్టిఫికెట్స్ స్కాన్డ్ కాపీలను వెరిఫికేషన్‌కు రాకముందే అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్స్ అన్ని మూడు సెట్లు నకలు కాపీలను చేసుకుని గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ తేదీని త్వరలో చెబుతామని డీఈఓ పేర్కొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

బద్వేలు అర్బన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిన ఓ వ్యక్తి మృతి చెందినట్లు అర్బన్ సీఐ ఎస్.లింగప్ప తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో రెండు రోజుల క్రితం అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ యువకుడిని 108 సహాయంతో ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఆసుపత్రిలో చేర్చిన సమయంలో తన పేరు బాషా అని, తన స్వగ్రామం చాగలమర్రి అని మాత్రమే తెలిపాడు. మృతుని బంధువులు ఎవరైనా గుర్తిస్తే అర్బన్ పోలీసులకు సంప్రదించాలని ఆయన కోరారు.

పోలీస్ కానిస్టేబుల్ శిక్షణకు సన్నాహాలు


పోలీసు శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్.సి.టి.పి.సి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డి.టి.సి) ఆదివారం తెల్లవారుజామున జిల్లా ఎస్పీఈ.జి అశోక్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను, బాటిల్ అబ్స్టాకల్ పరికరాలను పరిశీలించారు. డి.టి.సి డీఎస్పీ అబ్దుల్ కరీంకు పలు సూచనలు చేశారు.

కలకలం రేపుతున్న క్షుద్ర పూజలు


క్షుద్ర పూజలు చేసిన ప్రాంతం

సింహాద్రిపురం : మండల కేంద్రంలో క్షుద్ర పూజలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ కలకలం రేపుతున్నాయి. మండల కేంద్రంలో ఈద్గా సమీపంలో వెన్నపూసపల్లెకు వెళ్లే దారిలో క్షుద్ర పూజలు పలుమార్లు జరుపుతున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఇది ఎవరు చేస్తున్నారు.. ఎందుకు చేస్తున్నారో అర్థం కాక ఆ దారిన తరచూ వెళ్లే రైతులు, అలాగే మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఖర్చును కంట్రోల్ చేద్దాం

- టోల్ గేట్ల ఫీజు బాధ తప్పినట్లే
- రూ.3000తో పొందే అవకాశం
- ఏడాది లేదా రెండు వందల ట్రిప్పులకు చెల్లుబాటు


టోల్ ప్లాజా



ఫాస్టాగ్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు మనకు వివిధ ప్రాంతాల్లో టోల్ గేట్లు కనిపిస్తాయి. అక్కడ టోల్ చార్జి చెల్లించి ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. నాలుగు చక్రాలు ఆపైన పెద్ద వాహనాలన్నీ ఈ టోలు కట్టాల్సిందే. మనం వెళ్లే దారిలో ఎన్ని చోట్ల టోల్ గేట్‌లు ఉంటే అక్కడ డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా ఒక్కొక్క ట్రిప్పునకు టోల్ గేట్ ఇరువైపులా కలిపి 90 రూపాయల నుంచి 200 రూపాయలు ఖర్చు అవుతుంది. కానీ ఇక నుంచి ఆ భారం లేకుండా జాతీయ ఉపరితల రవాణా సంస్థ (ఎన్‌హెచ్) స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఏడాది పాసు విధానం తీసుకు వచ్చింది. కార్లు, జీపులు, వ్యాన్లు తదితర వాణిజ్యేతర వాహనాలకు ఇది వర్తిస్తుంది. ఒకసారి పాస్ తీసుకుంటే ఏడాది పాటు లేదా 200 ట్రిప్పులకు అవకాశం ఉంటుంది. ఒక టోల్ గేట్ దాటితే ఒక ట్రిప్పుగా పరిగణిస్తారు. ఆ దారిలో నాలుగు గేట్లు దాటి తిరిగి వెనక్కి వస్తే మొత్తం ఎనిమిది ట్రిప్పులు అయినట్టు లెక్క.

దేశవ్యాప్తంగా 1150 టోల్ గేట్లు..

గతంలో నగదు రూపంలో టోల్ ఫీజు వసూలు చేయగా తర్వాత ఫాస్టాగ్ వచ్చింది. దీని వల్ల టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ జామ్ చాలా వరకు తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా సుమారు 1150 వరకు టోల్ గేట్లు ఉన్నాయని అంచనా. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో 40 నెంబర్ జాతీయ రహదారిపై ఖాజీపేట మండలం దుంపలగట్టు వద్ద, రాయచోటి పరిధిలోని బండపల్లి వద్ద టోల్ గేట్లు ఉన్నాయి.

పాస్ పొందే విధానం..

ఇప్పటికే ఫాస్టాగ్ ఉన్న వాహన యజమానులు తమ ఖాతా నుంచి ఫాస్టాగ్ పాస్ పొందవచ్చు. ఆగస్టు 15 నుంచి పెద్ద ఎత్తున వీటిని కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ పాస్ సొంత కార్లు, వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. బస్సులు, టాక్సీలు, లారీలు, రవాణా వాణిజ్య వాహనాలకు చెల్లదు. ట్రావెల్స్ వినియోగించే కార్లకు, జీపులకు కూడా వర్తించదు. ఈ ఫాస్టాగ్ ఏడాది నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించే జాతీయ రహదారులు జాతీయ ఎక్స్‌ప్రెస్ రహదారుల్లోని టోల్ ప్లాజాలలో పనిచేస్తుంది.

డిజిటల్ రూపంలోనూ..

ఫాస్టాగ్ ఏడాది పాస్‌ను డిజిటల్‌గా తీసుకోవచ్చు. రాజ మార్గ్ యాత్ర యాప్ సెల్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని పొందవచ్చు. లేదా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా లభిస్తుంది. దీనికోసం రూ. 3వేలు చెల్లించాలి. సంబంధిత వాహనాలకు చెల్లుబాటు అయ్యే ఫాస్టాగ్ ఉండాలి. బ్లాక్ లిస్టులో ఉండకూడదు. సంబంధిత వాహన రిజిస్ట్రేషన్ నెంబర్ వివరాలు నమోదు చేసుకోవాలి. రూ. 3వేలు చెల్లించిన తర్వాత ఏడాది పాస్ సంబంధిత వాహన ప్రస్తుత ఫాస్ట్ ట్రాక్ లింక్ అవుతుంది. ఈ పాస్ ఏడాదికాలం లేదా 200 ట్రిప్పులు మాత్రమే పనిచేస్తుంది. ఈ రెండింటిలో దీని గడువు ముందైనా ఇంకా పనిచేయదు. ఈ పాస్ వల్ల టోల్ చార్జీలు బాగా తగ్గుతాయి.

ఉపయోగాలు ఇవే..

కేంద్ర రవాణా ఉపరితల మంత్రిత్వ శాఖ ఈ ఫాస్టాగ్ ఏడాది పాస్‌ను ప్రవేశపెట్టింది. జాతీయ రహదారిపై సొంత వాహనాల్లో ప్రయాణించే వారికి దీనివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా ప్రయాణంలో టోల్‌గేట్ భారం బాగా తగ్గించుకోవచ్చు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య


లక్ష్మీప్రసాద్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని వసంతపేటలో ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్ (34) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు ఉమ్మడిశెట్టి వెంకటసుబ్బన్న వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. అతనికి ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. వారిలో చిన్న కుమారుడైన ఉమ్మడిశెట్టి లక్ష్మీప్రసాద్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. రెండేళ్ల క్రితం ఎర్రగుంట్లకు చెందిన చంద్రకళ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న యువతితో వివాహమైంది. పెళ్లైన వారం రోజుల నుంచే వారి మధ్య విభేదాలు తలెత్తడంతో ఇద్దరు వేర్వేరుగా ఉంటున్నారు. పెద్దలు పంచాయతీ చేసినా వారి మధ్య సఖ్యత కుదరలేదు. గతంలో లక్ష్మీప్రసాద్ హైదరాబాద్‌లో ఆత్మహత్యా యత్నం చేశాడు. కొన్ని రోజుల తర్వాత అతని కిడ్నీ చెడిపోవడంతో డయాలసిస్ చేయిస్తున్నారు. తన ఆరోగ్యం కుదుట పడలేదని, చనిపోవాలనిపిస్తోందని అతను తల్లిదండ్రులతో చెప్పగా వారు ధైర్యం చెబుతూ వచ్చారు. ఈ క్రమంలో ఈ నెల 22న అతను హైదరాబాద్ నుంచి ప్రొద్దుటూరుకు వచ్చాడు. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత అతను మిద్దెపైకి వెళ్లి పడుకున్నాడు. రాత్రి పొద్దుపోయాక కుటుంబ సభ్యులు చూడగా లక్ష్మీప్రసాద్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. అతన్ని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి వెంకటసుబ్బన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్


సైకిల్ ర్యాలీలోపాల్గొన్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, పోలీసు సిబ్బంది

కడప అర్బన్ : శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుందని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు కడప నగర శివార్లలోని ఊటుకూరు సర్కిల్ నుంచి మౌంట్ ఫోర్ట్ స్కూల్ వరకూ 6 కి.మీ నిర్వహించిన సైకిల్ ర్యాలీని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. స్వయంగా ఎస్పీ పాల్గొని పోలీస్ అధికారులు, సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైక్లింగ్ సహజ సిద్ధమైన వ్యాయామమని తెలిపారు. ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమన్నారు. సైక్లింగ్ వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక ప్రశాంతతకు సాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏ.ఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ దారెడ్డి భాస్కర్ రెడ్డి, సి.కె. దిన్నె సి.ఐ. నాగభూషణం, డి.సి.ఆర్.బి ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఆర్.ఐ లు శివరాముడు, టైటస్, వీరేష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి.కె. జావీద్, చిన్నచౌకు సి.ఐ. ఓబులేసు, చెన్నూరు సి.ఐ. కృష్ణారెడ్డి, కడప టూ టౌన్ సి.ఐ. సుబ్బారావు, సి.కె. దిన్నె ఎస్.ఐ శ్రీనివాసుల రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'అగ్నివీర్'కు 159 మంది అర్హత


అగ్నివీర్ ఆర్మీ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఎస్వీ డిఫెన్స్ అకాడమి విద్యార్థులు

తిరుపతి రూరల్ : అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ రాత పరీక్షలో ఎస్వీ డిఫెన్స్ అకాడమికి చెందిన 159 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు ఆ అకాడమి చైర్మన్ బి.శేషారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి ఉచితంగా ఫిజికల్ ట్రైనింగ్ ఇచ్చామని, వారు ఉద్యోగంలో చేరడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. అర్హత సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

నేడు, రేపు కానిస్టేబుల్ అభ్యర్థుల పత్రాల పరిశీలన

కడప అర్బన్ : కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియకు హాజరైన అభ్యర్థుల్లో, సివిల్, ఏపీఎస్‌పీ, విభాగాల్లో తుది రాత పరీక్షలో ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు ఈనెల 25, 26 తేదీలలో ఉదయం 9 గంటలకు సంబంధిత పత్రాలతో కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో హాజరు కావాలని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ హాల్‌టికెట్ నెంబర్ 4001160 నుంచి 4206930 వరకు, 26వ తేదీ హాల్‌టికెట్ నెంబర్ 4214369 నుంచి 4504602 వరకు అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు.

రెడ్డెమ్మకొండలో భక్తుల రద్దీ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం ఉదయం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కుబడులు చెల్లించుకొన్నారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కుల మతాలకు అతీతంగా భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చి పూజలు నిర్వహించారు.

భూ వివాదంలో వ్యక్తిపై దాడి

మదనపల్లె రూరల్ : భూ వివాదం కారణంగా దాయాదుల మధ్య జరిగిన గొడవలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. మాలేపాడు పంచాయతీ దొనబైలుకు చెందిన కట్టప్ప కుమారుడు నాగరాజు(45) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. అతను వ్యవసాయం చేస్తున్న పొలానికి సంబంధించి గత కొంత కాలంగా దాయాదులతో వివాదం ఉంది. ఈ క్రమంలో ఆదివారం దాయాదులైన చంద్ర, మల్లికార్జున, విశ్వనాథ్ గొడవకు దిగారు. నాగరాజును కర్రలతో కొట్టారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

జిల్లా జూనియర్ బాల,బాలికల షూటింగ్ బాల్ జట్ల ఎంపిక


ఎంపికైన జిల్లా జూనియర్ బాలుర షూటింగ్ బాల్ జట్టు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డులోని గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో ఆదివారం జిల్లా షూటింగ్ బాల్ బాల,బాలికల జట్ల ఎంపిక జరిగింది. జిల్లా నలుమూలల నుంచి సుమారు వందమంది క్రీడాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు సెప్టెంబర్ నెలలో నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని తెలిపారు. జిల్లా అసోసియేషన్ చైర్మన్ జునైద్ అక్బరీ అభినందించారు. కార్యక్రమంలో ఏషియన్ గోల్డ్ మెడలిస్టు యూసుఫ్, అసోసియేషన్ సభ్యులు భారతి, మండల స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్ శివశంకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు కుమార్ నాయక్, జయంత్, తిరుమలేష్, పీడీలు గురు, మణి, లత, మంజుల, చిన్నప్ప, మౌనిక పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్ష రేసులో సుగవాసి

- సుగవాసికి జై కొడుతున్న మంత్రి అసమ్మతి నేతలు
- మంత్రి అనుయాయులకే అధ్యక్ష పదవి అంటున్న తమ్ముళ్లు
- జిల్లా అధ్యక్షుని ఎన్నికపై నేడు రాయచోటిలో త్రీ మెన్ కమిటీ సమావేశం

రాయచోటి : అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుని ఎన్నిక ఆ పార్టీలో వర్గ విభేదాలను బహిర్గతం చేస్తోంది. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జగన్‌మోహన్ రాజును రాజంపేట నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జిగా ప్రకటించడంతో జిల్లా అధ్యక్ష స్థానం ఖాళీ ఏర్పడింది. ఈ పదవిని టీడీపీ నేత సుగవాసి ప్రసాద్ బాబు ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లాలోని నియోజకవర్గాల నాయకుల మద్దతును కూడగట్టుకునే ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వ్యతిరేకంగా ఉన్న ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకుల మద్దతును కోరినట్లు తెలిసింది. ఇదే సమయంలో సుగవాసి ప్రసాద్ బాబుకు జిల్లా అధ్యక్ష పదవి రానివ్వకుండా జిల్లాకు చెందిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పావులు కదిపినట్లు సమాచారం. తన అనుచరులైన మైనార్టీలలో ఒకరికి జిల్లా అధ్యక్ష పదవిని ఇప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. ఇదే విషయంపై ఆదివారం రాయచోటిలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో స్థానిక మంత్రి చర్చించినట్లు కూడా తెలియవచ్చింది. జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి, కమిటీ ఎంపిక విషయంలో టీడీపీలో మరోమారు వర్గ విభేదాలు అన్నమయ్య జిల్లాలో బహిర్గతమయ్యాయని ఆ పార్టీకి చెందిన నాయకులు అభిప్రాయపడుతున్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పార్లమెంటు అధ్యక్షులు, అనుబంధ కమిటీల ఎంపిక విషయమై త్రీమెన్ కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సభ్యులు వీరాంజనేయులు, వై.నాగేశ్వర రావు యాదవ్‌ల ఆధ్వర్యంలో వినతులు, అభిప్రాయాలు స్వీకరించి రాష్ట్ర కమిటీకి ప్రతిపాదనలను అందజేయనున్నారు.

నేడు పార్లమెంటు స్థాయి విస్తృత సమావేశం..

రాయచోటిలోని సుధా కళ్యాణ మండపంలో రాజంపేట పార్లమెంటు స్థాయి విస్తృత సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నారు. అనంతరం పార్లమెంట్ కమిటీ, పార్లమెంటు అనుబంధ కమిటీలు, రాష్ట్ర కమిటీకి ప్రతిపాదనలు త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన స్వీకరించనున్నారు. సమావేశం సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరగనుంది.

విద్యాసాగర్ ఆస్పత్రిలో 500 రొబొటిక్ శస్త్ర చికిత్సలు


మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : బోన్, జాయింట్ కేర్‌లో అద్భుతమైన ప్రయాణంలో మరొక పెద్ద మైలురాయిని విద్యాసాగర్ ఆసుపత్రి అధిగమించిందని, తమ ఆస్పత్రిలో 500 రోబోటిక్ మోకాళ్ల శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం సంతోషంగా ఉందని ఆస్పత్రి ఎండీ డాక్టర్ సి.విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఆస్పత్రిలో ఆదివారం ఆయన కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నొప్పి నుంచి నూతన జీవితం వరకు ప్రయాణించిన అనేక మంది రోగుల చిరునవ్వులు చూడడం ఆత్మ సంతృప్తిని ఇస్తోందన్నారు. తమ ఆస్పత్రిలో గత 15 ఏళ్లుగా ఎముకలు, కీళ్ల సంరక్షణలో విశేష సేవలందిస్తూ 7500 లకు పైగా మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామన్నారు.

ఈ విజయం అధునాతన జాయింట్ రీప్లేస్‌మెంట్ సాంకేతికతలో ఒక ముందడుగు అన్నారు. రాయలసీమలో జాయింట్ కేర్ కోసం ప్రపంచ స్థాయి సీఓఆర్ఐ రోబోటిక్ సాంకేతికతను పరిచయం చేసిన మొదటి ఆసుపత్రిగా విద్యాసాగర్ హాస్పిటల్ , పాక్షిక, సంపూర్ణ మోకాళ్ల మార్పిడి శస్త్రచిత్సలతోపాటు హిప్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. 500 రోబోటిక్ మోకాళ్ల శస్త్రచికిత్సల మైలురాయిని చేరుకోవడం తమ బృందం అంకితభావానికి, ప్రజల నమ్మకానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, రిటైర్డ్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నాగముని రెడ్డి, ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథ రెడ్డి, సైకాలజిస్ట్ టీవీ రెడ్డి,, కడప నగరంలోని ప్రముఖ డాక్టర్లు, పెన్షనర్లు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలతో ఫిట్‌పర్సన్ బదిలీ


బదిలీ అయిన శంకర్ బాలాజీ

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీని హైకోర్టు ఆదేశాలతో దేవదాయ శాఖ కమిషనర్ బదిలీ చేశారు. ఆయన స్థానంలో స్థానిక మఠం మేనేజర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. మఠాధిపతి వీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి 2021 సంవత్సరం మే 18న శివైక్యం చెందారు. మఠాధిపతి నియామకంలో మఠాధిపతి పెద్ద భార్య కుమారులు, రెండవ భార్య మధ్య వివాదం కావడంతో పరిపాలన వ్యవహారాల కోసం మఠాధిపతి స్థానంలో దేవదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్న శంకర్‌బాలాజీని మఠం ఫిట్‌పర్సన్‌గా నియమించింది. దాదాపు మూడేళ్ల కాలంలో ఫిట్‌పర్సన్‌గా బి.మఠంలో రూ.10 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన చేస్తున్న కొన్ని పనులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని పూర్వపు మఠాధిపతి రెండవ భార్య మారుతీ మహాలక్షుమ్మ అభ్యంతరం వ్యక్తం చేస్తూ వచ్చారు. ఆయనను బి.మఠం ఫిట్‌పర్సన్‌గా తొలగించాలని మారుతీ మహాలక్షుమ్మ హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో శంకర్ బాలాజీని ఫిట్‌పర్సన్ బాధ్యతల నుంచి తొలగించాలని దేవదాయ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. దీంతో ఆయనను బదిలీ చేసి మఠం మేనేజర్ ఈశ్వరాచారికి బాధ్యతలు అప్పజెప్పారు.

హెచ్‌ఎంల సమస్యల పరిష్కారానికి కృషి


ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రధానోపాధ్యాయ సంఘం ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం కడపలోని డీసీఈబీ హాల్‌లో అన్ని మండలాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో పూర్వ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కార్యవర్గం సమక్షంలో నూతన జిల్లాస్థాయి ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి, నెల్లూరు జిల్లా నుంచి ఎన్నికల పరిశీలకుడిగా శ్రీనివాసులు, బుజయ్యలు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జి.వెంకటసుబ్బారెడ్డి(జెడ్పీ హైస్కూల్, బద్వేల్) ప్రధాన కార్యదర్శిగా డి. చంద్రశేఖరరావు (జమ్మలమడుగు ఎంఈఓ-2) కోశాధికారిగా బి.శ్రీనివాస్ రెడ్డి (ఉర్దూ జెడ్పీ హైస్కూల్ పెన్నానగర్, ప్రొద్దుటూరు), రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా జి.విజయ భాస్కర్ రెడ్డి(ఉర్దూ జెడ్పీ హైస్కూల్, సర్వర్‌ఖాన్‌పేట, ఖాజీపేట) డివిజనల్ అధ్యక్షులు, కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లుగా బి. రామకృష్ణయ్య(జెడ్పీ హైస్కూల్ పెద్దకూడాల) లక్ష్మీనారాయణరెడ్డి(జెడ్పీ హైస్కూల్ తొండలదిన్నె) ప్రతాపరెడ్డి(బి.మఠం హైస్కూల్) మహిళా విభాగంలోని సభ్యులను, లీగల్ కమిటీ, ఆడిట్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్నేహితుల మధ్య ఘర్షణ

కత్తితో దాడి-గాయాలు


గాయపడిన నాగరాజు

కమలాపురం : కమలాపురం మండలం రామచంద్రాపురం వద్ద స్నేహితుల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణగా మారింది. ఈ నేపథ్యంలో కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కమలాపురం మండలం చదిపిరాళ్లకు చెందిన శివారెడ్డికి, వల్లూరు మండలం పెద్దపుత్తకు చెందిన గోవర్ధన్ రెడ్డి రూ.4500 బాకీ ఉన్నాడు. ఆ డబ్బు సోమవారం ఇస్తానని చెప్పడానికి ఆదివారం గోవర్ధన్ రెడ్డి రామచంద్రాపురం వద్ద ఉన్న శివారెడ్డి వద్దకు వెళ్లాడు. అయితే తనకు ఇప్పుడే కావాలని శివారెడ్డి చెప్పాడు. ఈ నేపథ్యంలో కట్ట గ్రామానికి చెందిన ఆది, నాగరాజు, వినోద్, చరణ్ తేజ్‌తో పాటు మరి కొందరు రామచంద్రాపురం వద్దకు చేరుకున్నారు. అక్కడ ఏమి జరిగిందో తెలియదు గాని స్నేహితులైన గోవర్ధన్ రెడ్డి, నాగరాజు మధ్య వాగ్వాదం జరిగింది. ఇంతలో నాగరాజుపై గోవర్ధన్ రెడ్డి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో నాగరాజుకు గొంతు వద్ద తీవ్ర గాయమైంది. వెంటనే అతన్ని కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తీసుకెళ్లారు. కాగా జరిగిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

గంజాయి వినియోగం, విక్రయాలపై తనిఖీలు


కడప నగర శివార్లలో నిర్మానుష్య ప్రదేశాలలో తనిఖీ చేస్తున్న పోలీసులు

కడప అర్బన్ : జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి సేవించే, విక్రయించే అవకాశమున్న ప్రాంతాలు, ప్రదేశాలలో ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ అనుమానాస్పద వ్యక్తుల కోసం ఆరా తీశారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను జల్లెడ పడుతున్నారు. అనుమానాస్పద వ్యక్తులను క్షుణ్ణంగా విచారిస్తున్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి రవాణా, వినియోగం, విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

సెంచురీ పానెల్స్ పరిశ్రమలో విజిలెన్స్ ఏఎస్పీ ఆకస్మిక తనిఖీ


సెంచురీ పానెల్స్ పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ ఏఎస్పీ శ్రీనివాసరావు, అధికారులు

గోపవరం : సెంచురీ పానెల్స్ పరిశ్రమలో విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత అధికంగా ఉండటంతో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. అందులో భాగంగా సెంచురీ పానెల్స్ పరిశ్రమలో యూరియా డంప్ అవుతుందని సమాచారం రావడంతో విజిలెన్స్ సీఐ శివన్న, ఏఓ విజయరావు, బద్వేలు రూరల్ సీఐ క్రిష్ణయ్య, ఎస్ఐ శ్రీకాంత్, వ్యవసాయ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ యూరియా కేవలం పరిశ్రమలో వినియోగం కోసమే వాడుతున్నట్లు అధికారులు నిర్ధయించారు. ఈ తనిఖీల్లో పరిశ్రమ జీఎం రమేష్ కుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ఓబయ్య ఉన్నారు.

లాడ్జీలను తనిఖీ చేసిన పోలీసులు


కడప నగరంలోని లాడ్జీలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ అమర్‌నాథ్ రెడ్డి

కడప అర్బన్ : నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలలో భాగంగా కడప వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని లాడ్జీలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. లాడ్జిలలో బస చేసే వ్యక్తుల నుంచి ఆధార్ కార్డులు, ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వరాదని, లాడ్జి పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా సి.సి.కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లాడ్జిల్లో బస చేసిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.ఈ తనిఖీలలో కడప వన్ టౌన్ ఎస్.ఐ. అమరనాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.